క్లుప్తంగా

మల్లన్నకు జలాభిషేకం



నీళ్ల బిందెలతో గుడికి వెళ్తున్న మహిళలు

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామ శివారులో ఉన్న చల్ల మల్లన్న ఆలయానికి మహిళలు బుధవారం 201నీళ్ల బిందెలతో వెళ్లి దేవుడికి జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురవాలని పూజలు చేశారు.

పనులు వేగవంతం చేయాలి



భీమారం: మాట్లాడుతున్న ఎంపీడీవో

భీమారం: నర్సరీల్లో పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో మధుసూధన్ ఆదేశించారు. ఈజీఎస్ పనులపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో మొక్కలను నాటేందుకు ముందుగా చేపట్టే బ్యాగ్‌ఫిల్లింగ్ పనులను ఈ నెలఖరు లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్ రెడ్డి, ఏపీవో జీనత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలం బాట'



రైతులతో విద్యుత్ అధికారులు

దండేపల్లి: మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ బాపు రైతులతో మాట్లాడారు. వ్యవసాయ పొలాల్లో కరెంటు స్తంభాలు వంగినా, తీగలు వేలాడినా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పంట పొలంలో వంగిన విద్యుత్ స్తంభాన్ని తమసిబ్బందితో సరిచేయించారు. కార్యక్రమంలో సబ్‌ఇంజినీర్ సాయికృష్ణ, లైన్‌ఇన్‌స్పెక్టర్ గౌస్, లక్ష్మణ్, లైన్‌మెన్ మల్లేష్, జేఎల్‌ఎం శ్రీకాంత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'రఘునాథ్‌రావుపై ఆరోపణలు సరికాదు'

దండేపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావుపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య పేర్కొన్నారు. దండేపల్లిలో బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్న రఘునాథ్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. పార్టీ నాయకులు రాకేష్, శ్రీనివాస్, రవిగౌడ్, రవీందర్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీమ్ సేవలపై అవగాహన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి శ్రావన్‌కుమార్ విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్ 24/7 మఫ్టీలో ఉంటూ గస్తి తిరుగుతోందన్నారు. కళాశాలలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లు, హాస్పిటల్స్ వద్ద షీ టీమ్ పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. మహిళలు, కళాశాల విద్యార్థులకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఆకతాయిలు ఏడిపించడం, అసభ్యకరంగా మెసేజ్‌లు చేయడం లాంటి చర్యలకు పాల్పడితే వెంటనే షీ టీమ్‌కు, 100డైల్‌కు గాని 6303923700 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడుతాయన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలి

నస్పూర్: ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వారు నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు జనార్ధన్, కదారి రమేశ్, కొప్పర్తి రాజం, ఇరికిల్ల పురుషోత్తం, విజయ్, శంకర్, సంజయ్, సమ్మయ్య పాల్గొన్నారు.

కాలకృత్యాలకు కష్టాలు తప్పట్లే..!

పాఠశాల ఆవరణలోని చెట్ల పొదల్లో మూత్ర విసర్జన చేస్తున్న బాలురు



బెల్లంపల్లి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు శిథిలావస్థకు చేరి, కొత్తగా నిర్మించే మరుగుదొడ్ల పనులు నిలిచిపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు కో ఎడ్యుకేషన్‌లో విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటుండగా బాలురు 120మంది, బాలికలు 130చొప్పున ఉన్నారు. బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండగా, బాలురకు లేకుండా పోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగించలేనంత దుస్థితిలో ఉన్నాయి. 'మన ఊరు–మనబడి' భాగంగా కొత్తగా మరుగుదొడ్లు, మూత్ర శాలల నిర్మాణం చేపట్టగా కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో దాదాపు సంవత్సర కాలంగా పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుకుంటున్న బాలురకు మరుగుదొడ్డి, మూత్రశాలకు వెళ్లడానికి వీలులేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో అత్యవసరంగా తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల ఆవరణలో ఉన్న ఓ కట్టడం వెనకాల వెళ్లి పాములు, తేళ్లు సంచరించే వీలున్న పిచ్చి మొక్కల మాటున అత్యవసరాలను తీర్చుకుంటున్నారు. మరుగుదొడ్డికి వెళ్లలేని పరిస్థితులు ఉండగా, మూత్ర విసర్జనకు కూడా పాట్లుపడక తప్పడం లేదు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కదలిక



పనులు పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

తాండూర్: మండలంలోని రేచినిరోడ్ రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేయడంతో కదలిక వచ్చింది. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి సమస్యల తీవ్రతను తెలియజెప్పడంతో సానుకూలంగా స్పందించారు. రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పొడిగింపునకు సుముఖత వ్యక్తం చేశారు. అధికారులను రేచినిరోడ్ రైల్వేస్టేషన్‌కు పంపించి సమస్యల పరిష్కారానికి అవసరమైన సర్వే నిర్వహించి ఎస్టిమేషన్, ఇతర టెక్నికల్ అంశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే జీఎం ఆదేశాల మేరకు రైల్వే ఏడీఎం గోపి బుధవారం రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌కు వచ్చి అవసరమైన పనులను అడిగి తెలుసుకున్నారు. మండల కాంగ్రెస్ నాయకులు రైల్వే ఏడీఎంకు ప్రాధాన్యత క్రమంలో సమస్యలను వివరించి అవగాహన కల్పించారు. ఎట్టకేలకు రైల్వే అధికారుల్లో కదలిక రావడంతో ఈ ప్రాంత రైల్వే ప్రయాణికులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గిరాకీ తగ్గుముఖం.. జీవితం అగమ్యగోచరం

సుబ్బరాంపల్లిలో సారెపై ప్రమిదలు తయారు చేస్తున్న కుమ్మరి



చెన్నూర్‌రూరల్: చెరువుకు వెళ్లి మట్టిని తీసుకొచ్చి రెండు, మూడు రోజులు నానబెడుతారు. సారెపై ఉంచి తిప్పుతూ మట్టి ముద్దలను ప్రమిదలుగా తయారుచేస్తారు. ఈ ప్రమిదలకు దీపావళి సమయంలో గిరాకీ అధికంగా ఉంటుంది. ప్రస్తుతం వివిధ రకాల ఆకృతుల్లో లభించే రెడీమేడ్ ప్రమిదలు వివిధ రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి అవుతున్నాయి. ఆకర్షణీయంగా ఉండే వీటిని కొనేందుకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గిరాకీ లేక కుమ్మరి వృత్తిపై ఆధారపడిన వారి జీవితం అగమ్యగోచరంగా మారింది.



తయారు చేసిన ప్రమిదలు, కుండలు

బీఆర్ఎస్‌లో చేరిక

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లికి చెందిన 60మంది యువకులు బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీపై అసహనంతో పార్టీ వీడి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని చూసింది కేసీఆర్ అన్నారు. అమలు కాని హామీలు, పనికిరాని మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రయ్య, ముత్యంపల్లి మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉపసర్పంచ్ గోవింద్ తిరుపతి, మండల నాయకులు పాల్గొన్నారు.



దుర్గం చిన్నయ్యతో పార్టీలో చేరిన యువకులు

సమాచారం

అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టు, ట్రెయినీ ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్, రిటైయిల్ ట్రెయినీ అసోసియేట్స్ పోస్టుల కోసం అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి ఎం. రజనికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 18–35సంవత్సరాలు కలవారై ఇంటర్/డిగ్రీ/డీ ఫార్మసీ/బీ ఫార్మసీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.11000–25000వేల వరకు వేతనాలు చెల్లించనున్నట్లు తెలిపారు.

నేటి కార్మికుల దీక్ష వాయిదా

మంచిర్యాలటౌన్: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న దీక్షను విరమించుకున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్మికుల హాజరును మున్సిపల్ కార్యాలయంలోనే తీసుకోవాలని, మున్సిపాలిటీకి సంబంధం లేకుండా పులిపైల సాయికిరణ్ అనే వ్యక్తిని కమిషనర్ కారు డ్రైవర్‌ను నియమించుకొని మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగం పెట్టినందునా అతడి ఉద్యోగం తొలగించాలని కోరగా మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య సానుకూలంగా స్పందించినందుకు దీక్ష వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే భవిష్యత్‌లో దీక్ష చేపడతామని తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: హన్మకొండ ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో ఈ నెల 20, 21, 22న జరిగిన కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్‌జిల్లాల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్, సెలక్షన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మిమ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ రెండో సంవత్సరం విద్యార్థులు కమల్, డానియల్‌లు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్ విజయ్‌కుమార్, కళాశాల పీడీ శ్రీనివాస్‌లు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎండి.నీలు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల బెల్ల పల్లి మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయని తెలిపారు. అండర్–17, అండర్–19 విభాగాల్లో వేర్వేరుగా పోటీలు జరిగాయి. వాలీబాల్, ఫుట్ బాల్, లాంగ్ టెన్నిస్, క్రికెట్ విభాగాల్లో పోటీలు జరగ్గా ఏకంగా 12మంది విద్యార్థునులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించినట్లు తెలిపారు. హర్యానా రాష్ట్రంలో ఇటీవల జరిగిన 9వ జూనియర్ నేషనల్ సాఫ్ట్ బేస్‌బాల్ చాంపియన్ షిప్–2024–25పోటీల్లో అండర్–19 విభాగంలో జరిగిన పోటీల్లో ముగ్గురు బాలికలు పాల్గొని తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. విజేతలుగా నిలిచిన బాలికలను, ప్రతిభ చాటడానికి తగిన శిక్షణ ఇచ్చిన పీడీ రత్నం శిరీషను ప్రత్యేకంగా అభినందించారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

క్రైం కార్నర్

బెల్లంపల్లిరూరల్: రెండు పార్టీల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా సోషల్ మీడియాలో పోస్టు చేసిన యూట్యూబర్‌పై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామ పంచాయతీకి చెందిన సింగతి నరేందర్, సింగతి మల్లేశం మధ్య వారం రోజుల క్రితం భూమి తగాదా జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సింగతి నరేందర్ యూట్యూబ్, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. జరిగిన ఘటనను వరంగల్ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్ కుమార్ సంఘటనను వక్రీకరించి రెండు వర్గాలు, రెండు రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు పెంచేలా ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో తిరిగి పోస్ట్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సింగతి నరేందర్ బీఆర్ఎస్‌కు ఓటు వేసినందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నరేందర్‌పై గొడ్డలితో దాడి చేశారని ట్విట్టర్‌లో తప్పుడు సమాచారాన్ని పోస్ట్ చేశాడు. దీంతో తప్పుడు సమాచారాన్ని పోస్ట్ చేసి రెండు రాజకీయ వర్గాల మధ్య విద్వేషాలు సృష్టించిన చిలుక ప్రవీణ్ కుమార్‌పై తాళ్లగురిజాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. విద్వేషాలు సృష్టించేలా తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.

బొగ్గుబాయి వార్తలు

ఆధునీకరించిన కార్యాలయాలు ప్రారంభం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఆధునీకరించిన పలు డిపార్టుమెంట్ల కార్యాలయాలను ఏరియా జీఎం సంజీవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఏరియా ఇంజనీర్, ఫైనాన్స్ డిపార్టుమెంట్ల కార్యాలయాలను ఇటీవల పూర్తిగా ఆధునీకరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మనం పనిచేసే చోట సరైన వెంటిలేషన్, ప్రశాంత వాతావరణం ఉంటే ఉత్సాహంతో పని చేయగలుగుతామన్నారు. కార్యక్రమంలో ఏరియ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏజెంట్ రాముడుతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

ఐఎన్టీయూసీ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో బుధవారం ఐఎన్టీయూసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిట్ కార్యదర్శిగా పూదరి సాంబయ్య, సహాయ ఫిట్ కార్యదర్శిగా పాలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా కేఎస్ చక్రధర్, ప్రచార కార్యదర్శులుగా జీ శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ, ముఖ్య సలహాదారులుగా ఎం అంజనేయులు, కేపీ విజయ్‌కుమార్, షిఫ్ట్ కార్యదర్శులుగా రి లేకు బండ రవీందర్, మొగిలి సదానందం, రాంశెట్టి సతీశ్‌కుమార్, బీ రిలేకు పాదం రవి, సీహెచ్ బాపు, సీ రిలేకు గంజి రాజగోపాల్, దీకొండ స్వామి, మాడగోని శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్ ఇంచార్జీగా పుట్ట తిరుపతితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, జాతీయ సమితి సభ్యులు భీంరావు, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి పాల్గొన్నారు.



ఎన్నికైన కమిటీతో డివిజన్ నాయకులు

సర్వే జీఎం జైనులబుద్దిన్‌కు సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి సర్వే విభాగం జీఎంగా పని చేసి ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న జైనులబుద్దిన్‌ను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాయంలో బుధవారం ఏరియా జీఎం సంజీవరెడ్డి ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఆయన కంపెనీలో చేసిన సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ తరువాత శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాయుడు, శ్రీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, సర్వే అధికారి వెంకటేశం, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక ప్రగతి మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏరియా ఎస్‌ఓటూ జీఎం సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చేంజ్ ఆఫ్ క్వార్టర్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఖాళీగా ఉన్న క్వార్టర్లను వారి సీనియారిటీ ఆధారంగా కేటాయించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీవైపీఎం రాజేశ్, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ సెక్రెటరీల ఎన్నిక

శ్రీరాంపూర్: హెచ్‌ఎమ్మెస్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ సమక్షంలో ఫిట్ సెక్రెటరీలను ఎన్నుకున్నారు. ఏరియా జాయింట్ సెక్రెటరీగా ఎస్. రాంప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బొడ్డు సురేందర్, ఆర్కే 7 ఫిట్ సెక్రెటరీగా చెవులు శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా మీసాల మహేందర్, ఆర్కే న్యూటెక్ గని ఫిట్ సెక్రెటరీగా తుల అనిల్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఖాదీమేళా సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఖాదీమేళాను పట్టణ ప్రజలు, సింగరేణి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాదీమేళాను బుధవారం ఆయన ప్రారంభించారు. పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్‌తో కలిసి వస్త్రాలను పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

మరుగుదొడ్లకు నీటి వసతి

జైపూర్: జైపూర్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఏకమై వారు చదువుకున్న స్కూల్‌కు రూ.20వేలతో మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించడానికి పూనుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీస్‌మాధుర్యతో కలిసి బుధవారం పైప్‌లైన్ పనులు ప్రారంభించారు.

పాఠశాలల సందర్శన

దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో చిన్నయ్య బుధవారం సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మెటీవ్ 1 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీసీవో మల్లేష్ ఉన్నారు.

'తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు'

లక్సెట్టిపేట: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం కొంతమంది ప్రజాప్రతినిధులు పలు కేసుల్లో జైలుకు వెళ్లారని అలాంటి సంఘటనలకు, ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక బురద జల్లుతున్నారని ప్రజలు అలాంటి మాటలు నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు చెల్ల నాగభూషణం, ఎండీ ఆరీఫ్, బియ్యాల తిరుపతి, త్రిమూర్తి, వెంకటస్వామి, పూర్ణచందర్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్‌లో శిక్షణ పొందిన క్రీడాకారిణి కీర్తి అగర్వాల్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఫిట్‌నెస్ సెంటర్ అధ్యక్షుడు దారా కుమార్, తుల ఆంజనేయులు, రామన్న, శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రకాంత్, కోచ్ రాజేశ్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో 'ఓపెన్‌హౌస్'



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజశేఖర్

రామకృష్ణాపూర్/బెల్లంపల్లి/కాసిపేట/మందమర్రి రూరల్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పలు పోలీస్‌స్టేషన్లలో బుధవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, బెల్లంపల్లి రూరల్ సీఐ ఎండి.అఫ్జలుద్దీన్, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, మందమర్రి ఎస్సై రాజశేఖర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించాలి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించి ఉత్పత్తి పనులు ప్రారంభించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. లెదర్ పార్క్‌ను బుధవారం సందర్శించి స్థానికుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు జనార్దన్, రమేష్, శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

కాకో ఆలయం వద్ద భక్తుల సందడి





దండేపల్లి: దండారి ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకో ఆలయానికి ఆదివాసీ గిరిజన భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. గోదావరిలో స్నానాలు ఆచరించి, కాకోను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. గుస్సాడి వేషాలతో నృత్యం పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది.